సాక్షి
బాపట్ల
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



బోటింగ్ నిలిపివేత

విజయవాడ: వరద ఉధృతి నేపథ్యంలో భవానీ ద్వీపానికి బోటింగ్ సర్వీసులను పర్యాటక శాఖ నిలిపివేసింది. ఫలితంగా బోటింగ్ పాయింట్ వద్ద బోట్లన్నీ నిలిచిపోయాయి.



విత్తన దుకాణాల్లో తనిఖీలు

వినుకొండ(నూజెండ్ల): విత్తన దుకాణాల్లో ఏడీఏ జి.రవిబాబు తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం జేజీఎల్-384 రకం విత్తనాలు వ్యవసాయ సిబ్బంది ద్వారా అమ్ముతున్నట్లు తెలిపారు.

శ్రావణమాసం పూజలు



రొంపిచర్ల : స్థానిక శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పక్కన ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం శ్రావణ మాసం పూజలు నిర్వహించారు. బాబా వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సాగరం చెంతకు కృష్ణమ్మ పరవళ్లు

- నదిలో భారీగా పెరిగిన వరద ఉధృతి
- లోతట్టు ప్రాంతాల్లోకి రాకుండా విశ్వప్రయత్నాలు
- తీవ్రత పెరిగితే పంటలకు తప్పని ముప్పు



కొల్లూరు మండలం పెసర్లంక-పెదలంక అరవింద వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

కొల్లూరు: భారీగా వస్తున్న వరద నీటితో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నిండుగా ప్రవహిస్తూ సాగర సంగమానికి వెళుతుండటంతో కొల్లూరు మండలంలోని నదిలో నీటి మట్టం అంతకంతకూ పెరుగుతోంది. దీంతో అధికారులు నదీ తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడి వాణిజ్య పంటలకు వరద ముప్పు లేదు. కానీ 4 లక్షల క్యూసెక్కులకు పైబడి నీరు దిగువకు విడుదల చేస్తే రూ. కోట్ల మేరకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రైతాంగంలో ఉంది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మండలంలోని గాజుల్లంక తదితర గ్రామాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. పడవలను ఒడ్డుకు చేర్చారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా బాపట్ల జిల్లా గాజుల్లంక, కృష్ణా జిల్లా శ్రీకాకుళం నడుమ పడవల ద్వారా ప్రయాణికులను తీసుకెళ్లకుండా అధికారులు నిలువరించారు.

వరదకు అడ్డుకట్ట వేసేలా ఏర్పాట్లు

లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తి గ్రామాలను చుట్టుముట్టకుండా ముందుగానే అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో 1.50 లక్షల క్యూసెక్కుల నీరు నదిలోకి వస్తే పెసర్లంక అరవింద వారధి ఎగువన ఏర్పడిన గండి నుంచి కొల్లూరు కరకట్ట వైపునకు వరద చొచ్చుకొని వచ్చింది. ఇటుకల తయారీ కోసం తవ్విన గుంతలు, పల్లంలో పంట భూములలోకి నీరు ప్రవేశించింది. పెసర్లంకకు చెందిన వెలివల బసవరత్తయ్య ఆ గండి పూడ్చేందుకు పూనుకున్నారు. 4 రోజులుగా పొక్లయిన్‌ల సాయంతో అడ్డుకట్ట వేయించారు. ప్రస్తుతం నదిలో 3.50 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నప్పటికీ గండి ద్వారా పల్లపు భూముల్లోకి రాకుండా నిలువరించగలిగారు. నదిలోని నీరు అడ్డుకట్ట కింది భాగం నుంచి ఊట రూపంలో వస్తుండటంతో కట్ట బలహీనపడకుండా పనులు చేపట్టారు. ప్రవాహ వేగానికి అడ్డుకట్ట కొద్దిగా జారిపోతోంది. ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ కట్టను బలోపేతం పనులు కొనసాగుతున్నాయి. ఊటను నియంత్రించడానికి, ప్రవాహానికి కట్ట మట్టి కొట్టుకుపోకుండా చూసేందుకు కృషి చేస్తున్నారు. దిగువకు 4 లక్షల క్యూసెక్కులు మించే వరకు గండి ద్వారా నీరు లోతట్టు భూముల్లోకి చేరదని ప్రజలతోపాటు అధికారులు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పరిస్థితిని పరిశీలించిన ఆర్డీవో

భట్టిప్రోలు: కృష్ణా నదిలో వరద నేపథ్యంలో రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. పెదలంక కాకులడొంక, ఓలేరు పల్లెపాలెం రేవుల వద్దకు గురువారం ఆమె వచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అన్ని శాఖల సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో కృష్ణా నది తీరంలోని ఓలేరు పల్లెపాలెం, పెదలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భట్టిప్రోలు టీఎంరావు, వెల్లటూరు జెడ్పీ హైస్కూల్స్‌లలో పునరావాస కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బోట్లు, ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచారు. ఓలేరు పల్లెపాలెం వద్ద 9 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. ఆమె వెంట తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో టి. ఉషారాణి, సర్వేయర్ బి. శ్రీనివాసరావు, వీఆర్వోలు మంద్రు జక్రయ్య, శివరామకృష్ణ, ఎన్.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పుష్పలత, శ్రీదేవి తదితరులు ఉన్నారు. మండలంలోని పెసర్లంక నుంచి పెదపులివర్రు, ఓలేరు, కోళ్లపాలెం మార్గాల్లోని చప్టాల కింద నుంచి నీరు పారుతోంది. వరద మరింత పెరిగితే రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. కరకట్టలు బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలను ఇప్పటికే సిద్ధం చేశారు. రైతులు మోటార్లను ఊడదీసి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆర్‌సీ ఏఈలు కె.నాగేశ్వర నాయక్, ఎస్.సురేష్‌లు, సిబ్బంది ఆధ్వర్యంలో ఇసుక మూటలను సిద్ధం చేశారు.

కొల్లూరు: వరద పరిస్థితిపై వదంతులు నమ్మొద్దని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. జువ్వలపాలెం, పోతార్లంక, దోనేపూడి, పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణా నదిలో వరద తీవ్రతను ఆమె పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పోతార్లంక శివారు రావిలంకలో ప్రజలను తరలించడానికి బుధవారం వెళ్లిన ఇద్దరు ప్రభుత్వ సిబ్బంది అక్కడే చిక్కుకోవడంతో ఆర్డీవో ఆదేశాలతో సురక్షితంగా పోతార్లంక చేర్చారు. దోనేపూడి కరకట్ట దిగువన చిన్నరేవు లోలెవల్ వంతెనను పరిశీలించారు. రోడ్లపై నీరు ప్రవహించే ప్రాంతాలలో బందోబస్తు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లును ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ నిరంజన్, ఆర్ఐ త్రివేణి పాల్గొన్నారు.



కొల్లూరు మండలం జువ్వలపాలెం వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న రేపల్లె ఆర్డీవో హేలా షారోన్



ముందస్తు చర్యల్లో భాగంగా సిద్ధం చేస్తున్న ఇసుక బస్తాలు



పెసర్లంక అరవింద వారధి సమీపంలో భూముల్లోకి నీరు ప్రవేశించకుండా స్థానికుల ఏర్పాట్లు

పెనుమూడి రేవులో ఘాట్‌ను తాకిన వరద



పెనుమూడి వద్ద కృష్ణా నదిలో వరద ఉధృతి

రేపల్లె రూరల్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదిలో వరద తాకిడి పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి గురువారం విడుదల చేసిన నీరు రేపల్లె మండలం పెనుమూడి తీరం చేరుకోవటంతో ఈ ప్రాంత ప్రజల్లో కలవరం మొదలైంది. గతంలో చోటు చేసుకున్న పరిణామాలతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెనుమూడి రేవులో నీటి మట్టం కొద్దిగా పెరిగి ఘాట్ మెట్లను తాకింది. 6 లక్షల క్యూసెక్‌ల నీరు కిందికి విడుదల చేసినా ఈ ప్రాంతంలో ఇబ్బందులు ఉండవని, అంతకు మించి వస్తే ప్రమాదం పొంచి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

2009లో కృష్ణా నదికి వరద వచ్చిన సమయంలో కరకట్ట తెగి నీరు గ్రామాలలోకి, రేపల్లె పట్టణానికి చేరుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆ నాటి ఘటనను అధికారులు దృష్టిలో ఉంచుకుని తీరప్రాంతంలోని ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకుగానీ, పునరావాస శిబిరాలకుగానీ వెళ్లాలని సూచిస్తున్నారు. మత్స్యకారులు నదిలో చేపల వేటకు వెళ్లవద్దని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు పెనుమూడి పల్లెపాలెంలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. పెనుమూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునరావాస శిబిరంగా సిద్ధం చేస్తున్నారు. నది పరివాహక ప్రాంత గ్రామాలలో గ్రామ రెవెన్యూ అధికారులు, సహాయకులు అందుబాటులో ఉండి వరద నీటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని తహసీల్దార్ సూచించారు.

న్యూస్‌రీల్

గిరిజన అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

బాపట్లటౌన్: జిల్లాలోని బీఈడీ, డీఎడ్ పూర్తి చేసిన గిరిజన అభ్యర్థులకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 150 మందికి కోచింగ్ సెంటర్ల ద్వారా ఈ అవకాశం ఉందన్నారు. దానిలో భాగంగా బాపట్ల జిల్లాలో 38 మందికి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఎడ్‌లలో పొందిన మార్కుల ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ ఉంటుందన్నారు. అభ్యర్థులు తెల్లరేషన్ కార్డుదారులై ఉండాలన్నారు. డీఎస్సీ 2024కి నమోదు చేసుకున్న దరఖాస్తు నకలు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, డిగ్రీ, ఇంటర్, 10వ తరగతి, బీఈడీ, డీఎడ్, టెట్ మార్కుల లిస్టులు, ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు, 3 పాస్‌పోర్టు ఫోటోలతో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కాంప్లెక్స్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



చీరాల: చీరాల మండలం ఈపూరుపాలేనికి చెందిన సయ్యద్ ఆరిఫ్‌ను కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఈపూరుపాలెంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు పాల్పడిన వారిని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

12న బీఎస్ఎన్ఎల్ అవగాహన సదస్సు

నెహ్రూనగర్: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఈ నెల 12న వినియోగదారుల అవగాహన సదస్సును గుంటూరులోని అరండల్‌పేట బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జీఎం ఎస్. శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు జిల్లాలోని ఆసక్తిగల వినియోగదారులంతా హాజరు కావాలని కోరారు. కార్యాలయానికి రాలేని వారు https://meet.google.com/fzo-zbed-wxg ఆన్‌లైన్‌లో గూగుల్ మీట్ లింక్ ద్వారా సదస్సులో పాల్గొనవచ్చని చెప్పారు.


రేంజ్‌లో డీఎస్పీలు బదిలీ

నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది డీఎస్పీలను గురువారం బదిలీ చేశారు. ఈ మేరకు గుంటూరు రేంజ్‌లో పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. గుంటూరు పశ్చిమ డీఎస్పీ కేవీ.మహేష్‌ను హిందుపూర్‌కు, వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ జి.రామాంజనేయులును బాపట్లకు, బాపట్ల డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణను సీఐడీకి, సీఐడీలో ఉన్న డీఎస్పీ డి.సోమన్నను ఆదోనికి బదిలీ చేశారు.

తగ్గుముఖం పట్టిన కప్పల వాగు

ఊటుకూరు(క్రోసూరు): వర్షాలకు పొంగి ప్రవహించిన ఊటుకూరు కప్పలవాగు గురువారం తగ్గుముఖం పట్టింది. ఆటోలు, ప్రయాణికులు వాగు నుంచే నడిచారు. అయితే ఆర్టీసీ బస్సులు, లారీలు నడవలేదు. ఇక వర్షం లేకుంటే శుక్రవారం పూర్తిగా వాగు ప్రవాహం తగ్గుతుందని గ్రామస్తులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 266, బ్యాంక్ కెనాల్‌కు 1486, తూర్పు కెనాల్‌కు 530, పశ్చిమ కెనాల్‌కు 230, నిజాంపట్నం కాలువకు 410, కొమ్మమూరు కాలువకు 1910 క్యూసెక్కులు విడుదల చేశారు.

తమ్ముళ్ల 'చీకటి' వ్యాపారం

నైట్ టైంలో 'రైట్..రైట్'

- రాత్రి వేళ ఇసుక రవాణాకు గ్రీన్ సిగ్నల్
- ప్రజాప్రతినిధులకు అధిష్టానం వర్తమానం
- అడ్డుకోవద్దని పోలీసులకు మౌఖిక ఆదేశాలు
- పగటిపూట తరలిస్తే చెడ్డపేరని ఎత్తుగడ
- యథేచ్ఛగా అధికార పార్టీ అక్రమాల పర్వం
- ట్రాక్టర్ లోడు రూ. 8 వేల నుంచి 10 వేలు



వారం క్రితం కొల్లూరు వద్ద రాత్రి పూట కృష్ణా నది నుంచి ఇసుక అక్రమ రవాణా దృశ్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: 'ఇసుక పగలు తరలిస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. రాత్రి పూట మాత్రమే తవ్వకాలు జరపండి. డంపులు సిద్ధం చేసుకొని అమ్ముకోండి. అది కూడా రాత్రి 10 గంటల తర్వాత నుంచి మొదలుపెట్టి తెల్లవారుజామున 4 గంటలలోపే ముగించాలి. రోజూ రాత్రిళ్లు మాత్రమే ఇసుక అక్రమ రవాణా చేసుకోండి. పగలు తరలించవద్దు...' ఇదీ కూటమి ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ పెద్దల సూచన. ఇటీవల జరిగిన కలెక్టర్, ఎస్పీల సమావేశం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ అధినేత వద్ద ఇసుక అక్రమ రవాణా ఎలా చేసుకోవాలనే విషయం ప్రస్తావించినట్లు సమాచారం. పార్టీ విజయానికి అహోరాత్రులు పనిచేసిన నేతలు, కార్యకర్తలను కనీసం ఇసుక కూడా అమ్ముకోవద్దంటే క్షేత్రస్థాయిలో ఇబ్బందిగా ఉందని వారు చిన్నబాస్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సదరు నేత పగటిపూట కాకుండా ఇక నుంచి రాత్రిళ్లు మాత్రమే ఇసుకను తరలించి అమ్ముకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ విషయం పోలీసులకు చెప్పాలని నేతలు కోరడంతో తాను చూసుకుంటానని హామీ ఇచ్చిన చిన్నబాస్.. ఈ మేరకు సహకరించాలని జిల్లా పోలీసు అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయం ఇప్పుడు పోలీసు వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

ఎక్కడికక్కడ అడ్డగోలుగా..

నేతల సూచనలు అందుకున్న తమ్ముళ్లు అదేరోజు రాత్రి నుంచే ఇసుక అక్రమరవాణా మొదలు పెట్టారు. ఇసుక వనరులున్న ప్రతిచోట తవ్వకాలు ప్రారంభించారు. కృష్ణా కాలువకు నీళ్లు వదులుతారని తెలిసి రాత్రికి రాత్రే నది నుంచి ఇసుక తవ్వి తీసి డంపులు సిద్ధం చేసుకున్నారు. భట్టిప్రోలు మండలం వోలేరు, పెదలంక, వేమూరు మండలం జువ్వలపాలెం, కొల్లూరు మండలం గాజుల్లంక ప్రాంతాల్లోని డంపుల నుంచి రాత్రి పూట ఇసుక తరలింపు, విక్రయాలు మొదలు పెట్టారు. ఇక్కడి నుంచి రేపల్లె, నగరం, నిజాంపట్నం , చెరుకుపల్లి, తెనాలి ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. బాపట్ల నియోజకవర్గంలోని వెదుల్లపల్లి, పర్చూరు నియోజకవర్గంలోని వేటపాలెం తదితర ప్రాంతాల నుంచి బాపట్ల, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక తీసుకురావడం ఇబ్బందిగా ఉందని, రాత్రిపూట మాత్రమే సరఫరా చేస్తామంటూ పచ్చనేతలు కొనుగోలుదారులకు చెబుతూ... అధిక ధరలు వసూలు చేస్తున్నారు. వేమూరు, రేపల్లె ప్రాంతాల్లో కట్టడానికి పనికి వచ్చే మంచి ఇసుక ట్రాక్టర్ లోడు (4 టన్నులు) రూ. 8 వేల నుంచి 10 వేల వరకు విక్రయిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఈ ధర రూ. 5 వేల నుంచి రూ.7 వేలకు తగ్గకుండా అమ్మకాలు సాగిస్తున్నారు.

ఉచితం మాటున కూటమి ప్రభుత్వం వంచన...



కృష్ణా నదికి వరద వస్తోందని గాజుల్లంక రామాలయం ఎదుట నిల్వ చేసిన ఇసుక

ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన చంద్రబాబు, కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. తూచ్ అంటూ బాబు తన నైజం చాటుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకోసం సిద్ధం చేసిన ఇసుక నిల్వలనూ టన్నుకు ఇంతని రేటు పెట్టడమే కాకుండా తవ్వకాలు, లోడింగ్, పన్నులు, రవాణా వంటివి కలిపి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. అది కూడా వినియోగదారులకు ఇవ్వకుండా పచ్చనేతలకు కట్టబెట్టారు. వారు డంపులు సిద్ధం చేసుకొని ఇప్పుడు అధిక రేట్లకు అమ్ముకుంటూ దోపిడీకి పాల్పడుతున్నారు. వీరి దోపిడీ చూసి గత ప్రభుత్వం ఎంతో మేలని వినియోగదారులు వ్యాఖ్యానిస్తున్నారు.

కలబడిన టీడీపీ నాయకులు

- ఎస్ఎంసీ ఎన్నికలపై రాజకీయ వడగ
- పెదగొట్టిపాడు హైస్కూల్లో వైఎస్సార్ సీపీ అభిమాన ప్యానెల్ ఎన్నిక
- అడ్డుకుని దాడికి పాల్పడిన తెలుగుదేశం నాయకులు
- పోలీసుల సహకారంతో వైఎస్సార్ సీపీ నాయకుడిని బయటకు గెంటేసిన వైనం
- అధికార బలంతో రెండోసారి ఎన్నికలు జరిపి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్న టీడీపీ నాయకుల ప్యానెల్



టీడీపీ నేతల ఒత్తిడితో వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీకాంత్‌ను బయటకు నెట్టేస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలపై పచ్చ రాజకీయం పడగ విప్పింది. గెలిచిన వైఎస్సార్ సీపీ అభిమాన ప్యానెల్‌ను పక్కనబెట్టి, తెలుగుదేశం నాయకులు నిబంధనలకు విరుద్ధంగా రెండోసారి ఎన్నికలు జరిపించి తమ అనుకూల ప్యానెల్ గెలిచేలా కుట్రలు పన్నారు. వైఎస్సార్‌సీపీ అభిమానులను బూతులు తిడుతూ దాడికి పాల్పడటమే కాకుండా, పోలీసుల సాయంతో వైఎస్సార్ సీపీ నాయకుడిని పాఠశాల నుంచి బయటకు గెంటేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఇన్‌చార్జి హెచ్‌ఎం వేణు ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక నిర్వహించారు. తొలుత పాఠశాలలోని 3,4,5,6,7,8,9,10 తరగతులకు ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున 24 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. వారందరితో కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికకు మొత్తం 23 మంది సభ్యులు హాజరయ్యారు. కోరం సరిపోవడంతో హెచ్‌ఎం ఎన్నిక జరిపారు. 23 మంది సభ్యుల్లో 12 మంది వైఎస్సార్‌సీపీ అభిమాన చైర్మన్, వైస్‌చైర్మన్‌లను చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి హెచ్‌ఎం వేణు చైర్మన్‌గా బూసి ఏసుమరియమ్మ ఎన్నికైనట్లు తొలుత ప్రకటించారు.

టీడీపీ నేతల దౌర్జన్యం..

ఇంతలో విషయం బయటకు రావడంతో బయట ఉన్న టీడీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తమ సభ్యులు ఒకరు రాలేదని, ఇప్పుడు ఆ ఒక్కరిని కూడా పిలిపిస్తామని, మళ్లీ ఎన్నిక జరిపించాలని పట్టుబట్టారు. అధికార బలంతో ఇన్‌చార్జి హెచ్‌ఎంకు కీలక నేతల నుంచి ఫోన్లు చేయించి తీవ్ర ఒత్తిడి తెచ్చి తొలుత ఎన్నికైన కమిటీ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా పాఠశాలలోకి వెళ్లారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తయిన తరువాత మళ్లీ ఎన్నికలు ఎలా జరుపుతారని గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ శ్రీకాంత్‌తోపాటు మరికొందరు నాయకులు హెచ్‌ఎంను ప్రశ్నించారు. దీంతో టీడీపీ నాయకులకు శ్రీకాంత్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ నాయకులు శ్రీకాంత్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ, పాఠశాల గదిలో నుంచి బయటకు నెట్టుకుంటూ తీసుకువచ్చి కొట్టారు. అంతటితో ఆగకుండా పోలీసుల సాయంతో శ్రీకాంత్‌ను పాఠశాల నుంచి బయటకు పంపేశారు. టీడీపీ నాయకులు మాత్రం పాఠశాలలోనే ఉండిపోయారు. అనంతరం మళ్లీ ఎన్నికలు నిర్వహించి, తెలుగుదేశం అనుకూల ప్యానెల్‌ను గెలిపించుకున్నారు.

మరో సభ్యుడు రావడంతో మళ్లీ ఎన్నిక

పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంను 'సాక్షి' వివరణ కోరగా ముందు నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 24 మందికి 23 మంది సభ్యులు హాజరయ్యారని, వారిలో పన్నెండు మంది సభ్యులు బూసి ఏసుమరియమ్మను చైర్మన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. తరువాత 24వ సభ్యుడు వచ్చి తానూ సభ్యుడినే కదా మళ్లీ ఎన్నిక నిర్వహించాలని అడగడంతో మరోసారి ఎన్నిక పెట్టాల్సి వచ్చిందని చెప్పారు.

పోటీ చేయకుండానే వరించిన పదవులు!

- ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలలో విచిత్రం
- బడిలో ముగ్గురు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు
- ముగ్గురికి పదవులు కట్టబెట్టిన అధికారులు
- ప్రత్యేకత చాటిన కేశవరప్పాడు పాఠశాల



కేశవరప్పాడు పాఠశాల భవనం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా కారంచేడు మండలం కేశవరప్పాడు ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతను సంతరించుకుంది. గురువారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల పుణ్యమాని అది వెలుగు చూసింది. ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. కేశవరప్పాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు మాత్రమే చదువుతున్నారు. 3, 4, 5వ తరగతుల్లో ఒక్కొక్కరే విద్యార్థులు ఉన్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా ఉన్నప్పటికీ తగినంతమంది ఉపాధ్యాయులు లేకపోగా.. ఇక్కడ మాత్రం ఇద్దరు ఉండటం గమనార్హం. పాఠశాలలో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మిగతా సభ్యులను ఎన్నుకుంటారు. ఇక్కడ ఉన్న ముగ్గురు విద్యార్థులకు సంబంధించి వారి తల్లులు లేదా తండ్రులు మాత్రమే సాంకేతికంగా పోటీలో నిలిచే అవకాశం ఉంది. దీంతో ఉన్నతాధికారుల సూచనలతో వారి తల్లిదండ్రులకు కమిటీ బాధ్యతలు కట్టబెట్టారు. కమిటీ చైర్మన్‌గా సీహెచ్ అరుణ, వైస్ చైర్మన్‌గా సీహెచ్ కృపారావు, సభ్యురాలిగా ఎన్. సౌజన్యను నియమించారు.

జెడ్పీ స్థల పరిరక్షణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: సత్తెనపల్లిలో జిల్లా ప్రజా పరిషత్‌కు చెందిన రూ.కోట్లాది విలువైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా స్పష్టం చేశారు. హద్దు మీరి ఆక్రమణలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే అక్కడ అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని తొలగిస్తున్నట్లు ఆమె చెప్పారు. సత్తెనపల్లిలోని జెడ్పీకి చెందిన రెండు ఎకరాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై గురువారం 'సాక్షి'లో 'జెడ్పీ జాగా.. వేసెయ్ పాగా' శీర్షికతో ప్రచురించిన కథనంపై స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించారు. శుక్రవారం సంబంధిత స్థలాన్ని పరిశీలించేందుకు జెడ్పీ అధికారులను పంపుతున్నామని, పరిశీలన అనంతరం స్థల పరిరక్షణకు శాశ్వత రీతిలో రక్షణ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. జెడ్పీ అతిథి గృహాన్ని అభివృద్ధి పర్చడంతో పాటు జెడ్పీ స్థలంలో పిచ్చిచెట్లు, ముళ్ల కంపలను తొలగించి, జెడ్పీ అవసరాల కోసం వినియోగిస్తామని తెలిపారు. దాతల పేర్లతో పాటు ఇది జెడ్పీకి చెందిన ఆస్తి అని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా జెడ్పీ స్థలంలో నెలకొన్న ఆక్రమణలను తొలగించి, స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎన్వీబీఎస్ వసంతరాయుడు సత్తెనపల్లి ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి



రేపల్లె రూరల్: క్రిమిలేయర్‌ను అమలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉప కులాలవారీగా వర్గీకరించి రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది దోవా రమేష్ రాంజీ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లను తొలగించి మనువాద పాలన అమలుకు కేంద్రమే న్యాయస్థానం ద్వారా ఇలాంటి తీర్పులు ఇప్పిస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలలో దీనిపై చైతన్యం నింపుతామని తెలిపారు. తీర్పుపై పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ అప్పీలుకు వెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు, నియోజకవర్గ కార్యదర్శి పంతగాని నాగేశ్వరరావు, తెనాలి లావణ్య సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు



కొల్లూరు: కారు నియంత్రణ కోల్పోయి పంట కాలువలోకి దూసుకుపోయింది. దీంతో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన కొల్లూరు సమీపంలోని గ్యాస్ గోడౌన్ వద్ద చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం మేరకు.. పేరెచర్లకు చెందిన డి. హర్షవర్ధన్ గురువారం తన తల్లి నాగమల్లేశ్వరి, సోదరి మంజూషలతో కలిసి మండలంలోని పోతార్లంకలో ఉన్న తన భార్య వద్దకు కారులో బయలుదేరారు. రేపల్లె వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారు రోడ్డు వెంట రైతులు నిలిపిన బైకులను తప్పించే క్రమంలో హర్షవర్ధన్ నడుపుతున్న కారు వైపునకు దూసుకొచ్చింది. దానిని తప్పించేందుకు హర్షవర్ధన్ చేసిన ప్రయత్నం విఫలమవడంతో వీరి కారు పంట కాలువలోకి దూసుకెళ్లి, విద్యుత్తు స్తంభానికి సపోర్టుగా ఉంచిన పోల్‌ను ఢీకొంది. కారులోని ముగ్గురు స్వల్పగాయాలకు గురయ్యారు. రైతులు వారిని బయటకు తీసుకొచ్చి కొల్లూరులోని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందించారు.

పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టండి

ఎస్పీ తుషార్ డూడీ



బాపట్ల టౌన్: పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణ విధించాలన్నారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఎక్కడికి వెళుతున్నారు, ఎవర్ని కలుస్తున్నారు, ఏవైనా నేరాలకు పాల్పడడానికి అవకాశం ఉందా? వంటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఈ విధంగా చేయటం వల్ల వారు ఏదైన నేరానికి పాల్పడే అవకాశం ఉంటే ముందుగానే నిలువరించవచ్చని పేర్కొన్నారు. ఇటీవల చోటుచేసుకున్న తీవ్రమైన ఘటనలు కొన్నింటిని క్షుణ్ణంగా గమనిస్తే వాటిలోని నిందితులు గతంలో కూడా వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారన్నారు. నేరం చేసి రిమాండ్‌కు వెళ్లిన ముద్దాయిలు జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన తర్వాత వారి ప్రవర్తన, కదలికపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలుగుతూ ఇతరులతో కలిసి మెలిసి జీవించేలా పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. తరచూ నేరాలకు పాల్పడుతున్న వారి జాబితాను సిద్ధం చెయ్యాలన్నారు. గస్తీ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఎవరైనా అనుమానితులు తారసపడితే వారి వివరాలు అడిగి తెలుసుకోవాలని చెప్పారు. వారు చెప్పే సమాధానం నమ్మశక్యంగా లేనప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అతడిపై గతంలో ఏవైనా కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను తెలుసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాలను తరచూ సందర్శిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోనైనా పాతనేరస్థులు నేరాలకు పాల్పడితే సంబంధిత ఎస్‌హెచ్‌వోపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

మలబార్‌లో 'మైన్' డైమండ్ షో ప్రారంభం



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో 'మైన్' డైమండ్ షో ఎగ్జిబిషన్‌ను గురువారం డాక్టర్ శ్రీవిద్య కోనేరు, పెద్ది రమణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 14 వరకు మైన్ షో కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజు ధరించే నగలు, వివాహాభరణాలు, బరువు తక్కువ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు ఉందన్నారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకునే బంగారం విలువలో 10 శాతం ముందుగా చెల్లించి, అడ్వాన్స్ బుకింగ్ పొందవచ్చని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్‌లో పెరిగే బంగారం ధరల నుంచి లబ్ధి పొందవచ్చని తెలిపారు.

వైభవంగా చెన్నై షాపింగ్‌మాల్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి అనుపమా పరమేశ్వరన్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో చెన్నై షాపింగ్ మాల్ అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటి అనుపమా పరమేశ్వరన్ హాజరయ్యారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. వస్త్ర ప్రపంచంలో ఉన్న నూతన డిజైన్లను వంటిపై వేసుకొని చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ధరలకే నూతన డిజైన్లతో కూడిన నాణ్యమైన దుస్తులు చెన్నై షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 25 సినిమాలలో నటించటం జరిగిందని, మరో ఏడు సినిమాల్లో నటించబోతున్నట్లు తెలిపారు. అనంతరం షాపింగ్ మాల్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై డీజే టిల్లు 2 లోని పాటకు స్టెప్పులు వేసి ప్రజలను అలరింపజేశారు.

విత్తనమో.. రామచంద్రా!



రశీదులు రాసే కౌంటర్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



రోజుల తరబడి తిరుగుతున్నా విత్తనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల రైతులు

వరి విత్తనాల కోసం రైతుల ఇక్కట్లు

- రోజుల తరబడి తిప్పుకొంటున్న దుకాణ నిర్వాహకులు
- జేజీఎల్ 384 రకం విత్తనాల కోసం వస్తున్న అన్నదాతలు
- అధిక ధర ఇచ్చినవారికి విత్తనాలు ఇస్తున్నారని రైతుల మండిపాటు
- రశీదు పుస్తకాలపై రైతుల సంతకాలు లేకుండానే అమ్మకాలు
- కొందరికి బిల్లులు కూడా ఇవ్వడం లేదని వాపోతున్న రైతులు
- రికార్డుల నిర్వహణలోనూ తప్పుల తడకలు
- విక్రయదారుని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు



దుకాణంలో విక్రయదారుడిని హెచ్చరిస్తున్న ఏఓ కె.దేవదాసు

నకరికల్లు: విత్తనాల కోసం అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. రోజుల తరబడి తిరిగినా కావలసిన విత్తనాలు ఇవ్వడంలేదని మండిపడుతున్నారు. నకరికల్లు మండలంలోని అధీకృత డీలరుకు చెందిన విత్తనాల దుకాణానికి బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని గ్రామాలు, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం, రొంపిచర్ల, నకరికల్లు, రాజుపాలెం మండలాల్లోని గ్రామాల నుంచి రైతులు విత్తనాల కోసం వచ్చి రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు.

జేజీఎల్ 384 (జేజేలు) కోసం ఎదురు చూపులు..

సాగునీరు ఆలస్యంగా వస్తున్న ప్రస్తుత సీజన్‌లో జేజీఎల్ 384 (జేజేలు) రకం విత్తనాలు మంచి దిగుబడిని ఇస్తాయని అన్నదాతలు కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. కొందరు రైతులు గత 10రోజుల నుంచి ఉదయం వచ్చి సాయంత్రం వరకు కూర్చున్నా విత్తనాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. రోజుకో ధర చెబుతూ అందినకాడికి దండుకుంటున్నారని వాపోతున్నారు. దానికితోడు విత్తనాలు విక్రయించినప్పుడు ఇచ్చే రసీదుల్లో రైతుల సంతకాలు ఉండడం లేదు. అధికధరలకు విత్తనాలు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బుధవారం రాత్రి వరకు విత్తనాల దుకాణం దగ్గర పడిగాపులు కాసినప్పటికీ జేజీఎల్ రకం విత్తనాలు ఇవ్వలేదని, దుకాణం వద్దకు లోడు రాకుండానే పెట్రోల్‌బంకు సమీపంలో గుట్టుగా విక్రయాలు జరిపారని ఆరోపిస్తున్నారు. సకాలంలో విత్తనాలు అందించకుంటే సాగునీరిచ్చినా ఉపయోగంలేదని వాపోతున్నారు. ఈక్రమంలో గురువారం పెద్దసంఖ్యలో స్థానిక విత్తనాల దుకాణం వద్ద అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లులపై రైతుల సంతకాలు తీసుకోవడం లేదని, బ్లాక్ మార్కెట్‌లో విక్రయించనప్పుడు సంతకాలు ఎందుకు పెట్టించుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అక్కడే ఉన్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసును వివరణ కోరగా జేజీఎల్ 384 రకం విత్తనాలు స్టాకులేదని ఇకపై స్టాకు వచ్చే అవకాశం లేదన్నారు. బిల్లు పుస్తకాల్లో రైతుల సంతకాలు తీసుకోవడం లేదన్న విషయమై మొదటగా వారిస్తూనే హడావుడిలో రైతుల నుంచి విక్రయదారుడు సంతకాలు తీసుకోలేక పోయాడంటూ సర్దిచెప్పారు. ధరలో వ్యత్యాసాలు, రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా విక్రయించిన విషయమై వివరణ ఇస్తూ అవేమీ తన దృష్టికి రాలేదనడం గమనార్హం.

రొంపిచర్లలో 46.6 మి.మీ. వర్షపాతం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురువారం ఉదయానికి 46.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. డివిజన్‌లోని చిలకలూరిపేటలో 19.8 ఎం.ఎం, ఈపూరులో 5.6, యడ్లపాడులో 2.6, నరసరావుపేటలో 10.2, నాదెండ్ల 4.2, నూజెండ్ల 4.2, శావల్యాపురం 4.0, వినుకొండ 6.2 అలాగే బొల్లాపల్లి 2.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

జ్వరాలపై అప్రమత్తత అవసరం

- రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథరావు
- పారుపల్లిలో వైద్యశిబిరం పరిశీలన



శిబిరంలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఏటీ రామనాథరావు

పారుపల్లి(క్రోసూరు): మండలంలోని పారుపల్లి గ్రామంలోని గత నాలుగురోజులుగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనాథరావు గురువారం సందర్శించారు. పారుపల్లిలో వైద్యశిబిరంలో ఏటీ రామనాథరావు ఉండగా శిబిరంలో 64 మందిని ఓపీ చూడగా ఐదుగురికి సాధారణ జ్వరాలున్నట్లు గుర్తించి మందులు అందజేసారు. ఈ సందర్భంగా రామనాథరావు మాట్లాడుతూ సీజనల్ జ్వరాలు ఉంటాయని, వైద్యులు, వైద్యసిబ్బంది జ్వరాలపై అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వీధులు, ఇళ్లు పరిశీలించారు. నీళ్ల నిల్వ ఉండే తొట్టెలు, టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు లాంటివన్ని వెంటనే తొలగించాలన్నారు. ప్రజలు దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇన్నారావు, మలేరియా అధికారి రత్నాకరరావు, బేగ్, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

11న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్



చెస్ పోటీల కరపత్రం ఆవిష్కరిస్తున్న రామశేషగిరిరావు, డాక్టర్ నెల్లూరి రమేష్, వి.సత్యనారాయణ

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఎంఏఎం కళాశాలల ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు కళాశాలల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం చెస్ టోర్నమెంట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామశేషగిరిరావు, నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్, ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణలు పాల్గొన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్, ఎంఏఎం కళాశాలలు, నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో ఎంఏఎం కళాశాలలో చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు రామశేషగిరిరావు తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో విజేతలకు రూ.50వేలు నగదు బహుమతిని అందజేస్తామని చెప్పారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతితో పాటు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో జరిగే పోటీలలో పాల్గొనదలచిన వారు 9703049378, 9391339343 నంబరులో సంప్రదించాలని కోరారు.

టిడ్కో సముదాయంలో మౌలిక వసతులు కల్పిస్తాం

- మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట: టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణ చెప్పారు. టిడ్కో గృహ సముదాయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ముందుగా ఎన్ఆర్‌టీ సెంటర్‌లో మరమ్మతులు నిర్వహించిన అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలో ప్రభుత్వ పాఠశాల, కమ్యూనిటీ హాలు, అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సెకండ్ ఫేజ్ 1,008 గృహ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. పారిశుద్ధ్యంతో పాటు టిడ్కో గృహ సముదాయ నిర్వహణ బాధ్యతలు పురపాలక సంఘం వహిస్తుందని చెప్పారు. ఈ నెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లు పునః ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా టిడ్కో గృహ సముదాయానికి బస్సు సౌకర్యాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడ్కో ఎండీ వర్మ, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

నదీ పరివాహక గ్రామాలు అప్రమత్తం



రామాపురంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కుటుంబరావు

దాచేపల్లి: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్టుగేట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేయటంతో కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తహసీల్దార్ వైవీ కుటుంబరావు అన్నారు. మండలంలోని రామాపురం, పొందుగల గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. నదిలో నీటి ఉధృతిని పరిశీలించారు. రామాపురంలో మత్స్యకారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటం వలన వేటకు వెళ్లవద్దని, పడవలు, వలలు జాగ్రత్తగా భద్రం చేసుకోవాలని సూచించారు. నదిలో నీటి ప్రవాహం పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. పొందుగలలో కూడా పర్యటించి నది వెంబడి నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

గుంటూరు రేంజ్‌లో మరో 30 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో 30 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 31న 24 మంది సీఐలను బదిలీ చేయగా, 15 మందిని వీఆర్‌కు పంపించిన విషయం విధితమే..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
టి.పి.నారాయణస్వామి	పల్నాడు జిల్లా కారెంపూడి	గుంటూరు జిల్లా పెదకాకాని పీఎస్
గంగా వెంకటేశ్వర్లు	గుంటూరు రేంజ్ వీఆర్	గుంటూరు జిల్లా తుళ్ళూరు -1 పీఎస్
బెల్లం శ్రీనివాసరావు	గుంటూరు రేంజ్ వీఆర్	గుంటూరు జిల్లా తెనాలి రూరల్ సర్కిల్
దాసరి ప్రసాద్	ప్రకాశం జిల్లా గిద్దలూరు సర్కిల్	పల్నాడు జిల్లా గురజాల టౌన్ పీఎస్
పాచిపాలు ప్రభాకర్	గుంటూరు రేంజ్ వీఆర్	పల్నాడు జిల్లా మాచర్ల టౌన్ పీఎస్
షేక్ నఫీజ్ బాషా	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కందుకూరు సర్కిల్	పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ సర్కిల్
టి.శ్రీనివాసరావు	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కొవ్వూరు సర్కిల్	పల్నాడు జిల్లా కారంపూడి సర్కిల్
ఆర్.అహమీద్‌జానీ	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా డీఎస్‌బీ-2	బాపట్ల జిల్లా బాపట్ల టౌన్ పీఎస్
కె.గంగాధర్‌రావు	తిరుపతి ఆర్ఎస్‌టీఎఫ్ సీఐ	బాపట్ల జిల్లా బాపట్ల రూరల్
షేక్ అన్వర్‌బాషా	గుంటూరు జిల్లా కొత్తపేట పీఎస్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా నెల్లూరు-2 టౌన్ పీఎస్
ఎం.రోశయ్య	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా సౌత్ ట్రాఫిక్ పీఎస్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా నెల్లూరు-4 టౌన్
పీఎస్‌జీ గంగాధర్‌రావు	గుంటూరు రేంజ్ వీఆర్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా ఆత్మకూరు సర్కిల్
కె.వాసు	తిరుపతి కమాండ్ కంట్రోల్ సీఐ	గుంటూరు జిల్లా తాడికొండ పీఎస్
మాకినేని శ్రీనివాసరావు	ఒంగోలు డీపీటీసీ/డీటీసీ	పల్నాడు జిల్లా అమరావతి టౌన్ పీఎస్
వై.రామారావు	గుంటూరు రేంజ్ వీఆర్	ప్రకాశం జిల్లా దర్శి సర్కిల్
కె.సురేష్	పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ సర్కిల్	ప్రకాశం జిల్లా గిద్దలూరు యూపీఎస్
జె.రామకోటయ్య	ప్రకాశం జిల్లా కంభం సర్కిల్	ప్రకాశం గిద్దలూరు సర్కిల్
ఎండీ ఫిరోజ్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కనిగిరి సర్కిల్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కావలి 1 టౌన్
కేశవ వెంకటేశ్వరరావు	ప్రకాశం జిల్లా పీసీఆర్ సీఐ	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కందుకూరు సర్కిల్
జి.మంగారావు	పల్నాడు జిల్లా పెదకూరపాడు సర్కిల్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా గుడ్లూరు సర్కిల్
వై.వీరాసోమయ్య	ప్రకాశం జిల్లా గిద్దలూరు యూపీఎస్ సీఐ	గుంటూరు జిల్లా పాతగుంటూరు పీఎస్
కె.శేఖర్‌బాబు	గుంటూరు రేంజ్ వీఆర్	తిరుపతి గుడూరు -1 టౌన్ పీఎస్
హెచ్ఎస్ హుస్సేన్‌బాషా	నెల్లూరు జిల్లా సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్	తిరుపతి వాకాడు సర్కిల్
ఎం.బాజీ	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా, నెల్లూరు 2 టౌన్	తిరుపతి నాయుడుపేట యూపీఎస్
మాకినేని మురళీకృష్ణ	గుంటూరు రేంజ్ వీఆర్	తిరుపతి సూళ్లూరుపేట సర్కిల్
జి.సోమశేఖర్	బాపట్ల జిల్లా చీరాల 2 టౌన్ పీఎస్	ప్రకాశం జిల్లా కొండేపి సర్కిల్
ఎ.శివప్రసాద్	గుంటూరు పీసీఆర్	గుంటూరు లాలాపేట పీఎస్
కె.వేమారెడ్డి	గుంటూరు మహిళా పీఎస్-1	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా సంగం సర్కిల్
ఎం.వీరయ్య	గుంటూరు రేంజ్ వీఆర్	గుంటూరు కొత్తపేట పీఎస్
ఎస్.శ్రీకాంత్	గుంటూరు రేంజ్ వీఆర్	ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ సర్కిల్

క్వారీ గుంతలో గల్లంతైన వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: ప్రమాదవశాత్తు క్వారీగుంతలో పడి గల్లంతైన నాయిని హనుమంతరావు (35) మృతదేహాన్ని గురువారం రాత్రి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెలికితీశాయి. పోలీసులను చూసి భయపడి పరుగెడుతూ పిడుగురాళ్లకు చెందిన హనుమంతరావు మంగళవారం క్వారీ గుంతలో పడిన విషయం విధితమే. గత మూడురోజులుగా పోలీసులు ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి మతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.